# సంచారి

-జి. వెంకటకృష్ణ

హౌస్‌హోల్డ్ సర్వే చేస్తూ కమ్మవారిపల్లెలో వీథులు తిరుగుతున్నాడు ప్రసాద్. ఇల్లిల్లూ తిరుగుతూ వివరాలు రాసుకుంటున్నాడు.

"ప్రతియేడూ రాసుకుంటానే వుంటారు లోన్లు యిచ్చేది మాత్రం లేదు..." వొకామె అంటోంది, వివరాలు అడిగినందుకు.

"మన్లాంటోల్ల క్వాలిస్తారే.. షావుకార్ల కిస్తారు గానీ..." యింకొకామె.

"ఇల్లిల్లూ తిరిగి తిరిగి రాసుకునేదీ... సర్పంచింట్లోనో, రెడ్డింట్లోనో కూచ్చోని వాల్లు చెప్పినోల్లకిచ్చేదీ..."

నిజమేననిపించింది ప్రసాద్‌కు, ... ఏమీ లేనివాళ్ళ కెప్పుడైనా యిస్తారా? యివ్వాలంటే గ్యారెంటీలూ, షూరిటీలూ... రెకమెండేషన్లూ... కావాలి. అవి లేనోళ్ళకి ఎలా యిస్తారు? తిరిగి తిరిగి డబ్బున్నోల్లకి, వాళ్ళ అనుచరులకీ చేరుతాయి అన్ని సబ్సిడీలూ... ప్రజలకు ప్రయోజనం లేని సర్వేలు... అయినా చేయాల్సిందే... రెండ్రోజుల్లో రిపోర్టివ్వాలన్న ఆఫీసు తాఖీదు ప్రసాద్‌ను వెంటాడుతోంది.

"ఏంది నాయనా రాసుకుంటాండావు..." వీధి ముగదాల నులకమంచమ్మీద కూచోని భూతద్దాల్లోంచీ చూస్తూ అడిగాడో ముసలాయన. తాను వీ.డి.వో.ననీ, సర్వే చేస్తున్నాననీ చెప్పాడు ప్రసాద్...

"యా వూరు మీది..."

ప్రసాద్ సమాధానం చెప్పలేని ప్రశ్నే అడిగాడు పెద్దాయన. దేనికైనా సమాధానం చెప్పగలడేమో గానీ, ఈ ప్రశ్నకు మాత్రం జవాబు చెప్పలేడు. ఏ వూరని చెప్పాలి?

స్వంతూరంటే... స్వంతిల్లూ, అంతో యింతో భూమీ, నా వాళ్ళనుకునే బంధువులూ వుండాలా?! అవన్నీ ఏమీలేనివాళ్ళ సంగతీ?

తమ మూలాలు తెలీని సంచార జాతులు ఎన్నెన్నో వున్నాయి... వాళ్ళేమి చెప్పాలి?

సమాధానం దొరకని ఆలోచనల్తో ఓ యింటి ముందు ఆగాడు.

ఇంటి తలుపుకున్న నెంబరు, తన వద్ద వున్న లిస్టుతో సరిపోతోంది... యింటికి తాళమేసుంది...

ఇంటి ఎదురుగా అరుగుమీద కూచొన్న ముసలామెను "అవ్వా, యీ యింటి వాళ్ళెవరూ లేరా... యాటికి పోయినారు..." అడిగాడు.

"వాడిబ్బుడు వూరుముందరున్నాడు... ఆ పక్కల్లే వాని మామగారిల్లు..."

మాట పూర్తిగాక మునుపే పక్కింట్లోంచి ఓ మధ్య వయసామె బయటికొచ్చి

"యాల సార్ యేమిగావల్లా..." కటువుగా అడిగింది.

"వెంకటేశులని యీ యింట్లో వుండాల్నే..." మాటను పూర్తి కానీకుండానే

" ఆ పేరున్నోల్లెవురూ మా యింట్లో లేరు..." అని గట్టిగా అని

"కులం దప్పినోల్లందరికీ మా యిల్లే కావాల్సి వొచ్చింది..." చిన్నగా గొణుక్కుంటోంది.

అంతలో యింకో ముసలామె బయటికొచ్చి

"యా పేరు... యెవురు గావాలంటా..." అంటూంటే, మధ్య వయసామె ముసలామెను కొరకరా చూస్తూ,

"యెవురైతే నీకాలా... గమ్మునుండు" గద్దిస్తోంది.

"సరే ఈ యింటి వివరాలు తెలీకుంటే మానె, మీ వివరాలన్నా చెప్పండి..."

ప్రసాద్, ఆమె ముందుకు వెళ్ళాడు.

మధ్య వయసామె వివరాలు చెప్తోంది... ప్రసాద్ రాసుకుంటున్నాడు.

ఇంటిలో నుండి వచ్చిన ముసలామె, అరుగుమీద కూచొన్నామె వద్దకు వెళ్ళి...

"ఏందంటనే నారాయణమ్మా..." అనడిగి, విషయం తెలుసుకొని,

"ఆ నా బట్టకు సెప్పిరా పోయే... ఏమన్నా రాపిచ్చుకుంటాడేమో..."

రహస్యంగా చెప్తున్నా ప్రసాద్ చెవుల్లో పడుతూనే

వుంది... యిట్లాంటి వన్నీ పల్లెల్లో మామూలేననుకుంటూ,

సాయంకాలం దాకా వూరు తిరిగి వివరాలు రాసుకోవడం ముగించి, రోడ్డు పక్కన మర్రిచెట్టు కింద కట్టమీద కూచున్నాడు... ప్రసాద్, తను కాపురముంటున్న వూరి కెళ్దామని, బస్‌కోసం చూస్తూ...

రోడ్డుకు అటువైపు నీలగిరి చెట్ల కిందనున్న డేరాల వైపు అప్రయత్నంగా అతని చూపులు పడ్డాయి. ఐదారు డేరాలున్నాయి... వాటి ముందు... అస్తవ్యస్తంగా బట్టలూ... మురికి మురికిగా వున్న పిల్లలు ఆడుకుంటున్నారు... అక్కడే ఆడవాళ్ళు... రాతి పొయ్యిల మీద వొండుకుంటున్నారు... సంచార జాతులు... కడుపు చేత బట్టుకొని... రకరకాల విద్యల్తో... ఆటల్తో... వ్యాపారాలతో... నాగరికతలు యిన్నివేల సంవత్సరాలు నడిచొచ్చినా... వాటికి సమాంతరంగా... చరిత్రలో... ఎదుగూ బొదుగూలేని... సంచరిస్తున్న జాతులు... ముత్తాతలూ తాతలూ తండ్రులూ పిల్లలూ... పిల్లల పిల్లలూ... ఇలా యిప్పటికీ... ఎప్పటికీనా?... పేదరికంలో... భాగ్యరేఖ సరిహద్దుల్లోనైనా అందుకోలేక... జన్మభూమిలో కాందిశీకులుగా?!...

"సా..." అన్న పిలుపుతో ఆలోచనల్లోంచీ తలతిప్పి చూశాడు ప్రసాద్. గిరజాల జుత్తూ, రొయ్య మీసాలూ... సరిగా పెరగని గడ్డం... తలకు ఎర్రమఫ్లర్ చుట్టుకొని.. మెడలో నల్లని దారంతో బిగించిన తాయెత్తూ... చేతులులేని టైట్ బనియన్... మోకాళ్ళ కిందకు వేలాడుతున్న లుంగీ... ఓ ఆగంతకుడు... కాస్త వంగి రెండు చేతులూ జోడించి నమస్కరిస్తూన్నాడు... అతని కళ్ళు మూసుకుపోతున్నాయి... తాగున్నాడని తెలుస్తూనే వుంది... "...సా... నేనేసా... వెంకటేశుల్ని..." తడబడుతూ..

"వెంకటేశులా... యే వెంకటేశులు... యేం కావాలి..." అన్నాడు ప్రసాద్, కూచొన్న వాడు లేచి నిల్చుంటూ...

"మా మావొల్లింటి ముందుండే ముసిల్ది చెప్పె సా... యేందో లోన్లంటనే... నాపేరు గూడా రాసుకోండి సా..." ప్రాధేయపడే గొంతుతో – ప్రసాద్‌కు అర్థమైంది... మధ్యాహ్నం సంగతి గుర్తొచ్చి... ఓహో ఆ యింటి మనిషివా... ఆ యింట్లో వున్నట్లు రాసుకోవద్దంది గదా ఆమె, అనుకొని...

"ఆ యింట్లో నువ్వు లేవంటా... నీ యిల్లెక్కడా..." అడిగాడు.

"నా కిల్లు లేదు సా... ఆ, డేరానే సా నా యిల్లు..." అంటూ రోడ్డుకు అటువైపున్న ఓ డేరాను చూపించాడు.

ప్రసాద్ ఒక్కసారిగా షాకయ్యాడు.

"డేరాలో యెందుకున్నావబ్బా... మీ వాల్లింట్లోనే వుండొచ్చుగదా..."

వూర్లో వుండేవాడు వూరి బయటి డేరాల్లో కెట్లా వచ్చాడా అన్న ఆశ్చర్యంతో అడిగాడు.

ఆ యిల్లు నాది కాదు సా... మా మామిచ్చిండు... నన్ను దొబ్బేసినారు... యింగిబ్బుడు డేరానే సా..."

"యింతకీ యేంజేస్తావ్ నువ్వు..."

"యింతకు ముందు గాజుల యాపారం, పూసల యాపారం చేస్తాంటి... యిబ్బుడు ప్లాస్టిక్ బిందెల యాపారం సా..."

గాజుల మలారం మోసుకొని వూరూరూ తిరిగేవాడా... తన మూలాలేవో లోపల కదలిన చప్పుడు ప్రసాద్‌లో... యెర్రని ఎండల్లో... కాళ్ళకు చెప్పులు లేకున్నా... జీవనోపాధికి... "గాజులమ్మోవ్..." అని అరుస్తూ... వీధులూ... వూర్లూ... తిరిగే... తన తాతల ముత్తాతల సంతానాలు... ఎదురుగా ఈ పూసల వెంకటేశులు...

"ఎందుకు వాళ్ళు యిల్లు లాగేసుకున్నారు..." ప్రసాద్ గొంతు జీరబోయింది.

"నా కత పెద్దద్సా..." అని టూకీగా చెబుతూన్నాడు.

అతని వ్యథను ప్రసాద్ వింటున్నాడు...

అంతలో ఓ అమ్మాయి గడ్డి మోపును నెత్తిమీద మోస్తూ వాళ్ళ దగ్గరగా వచ్చి గడ్డిమోపును కట్టమీద దించి "నాయినా..." అని వెంకటేశుల్ని పలకరించింది.

అమ్మాయికి పధ్నాలుగు, పదహైదేండ్లు వుంటాయి... చిదిపి దీపం పెట్టుకునేలా వుంది... నిండైన విగ్రహం... మరీ మరీ చూడాలనిపిస్తూన్న



అందమైన కళ్ళు...

"వస్తా పొమ్మే..." ఆ అమ్మాయితో అని

"ఇదేసా నా ముందు పెండ్లాం కూతురు, మా మామోల్లింట్లో వుంది..." అన్నాడు వెంకటేశులు.

ఆమె ఓ డేరా ముందు ఆడుకుంటున్న పిల్లవాడి చేతిలో యేదో పెట్టి లోనికి పోయింది...

" ఈ పాప పెద్దమేనమామ కొడుకుతో దీని పెండ్లి చేస్తే నా బదనాయం తీర్తాది సా... పెండ్లి కర్చులకి లెక్కగావల్ల గదా సా... నాకేమన్నా లోనిప్పీ సా..."

కొద్దిసేపటి తర్వాత అమ్మాయి బయటికొచ్చి కట్టమీదున్న గడ్డిమోపును నెత్తినెత్తుకొని వూర్లో కెల్తోంది...

"గ్యారెంటీగా వాళ్ళు చేసుకుంటారంటావా..."

వెల్తున్న అమ్మాయినే చూస్తూ అడిగాడు ప్రసాద్. డేరాలో వుండేవాడి కూతుర్ని వాళ్ళు చేసుకుంటారా అన్న అనుమానం వెంటాడింది ప్రసాద్‌ను.

"సేసుకోకుంటే వదుల్తానా సా... యిన్నేండ్లు వాళ్ళింట్లోనే పెరిగింది... పిల్లప్పట్నుంచీ ఆ పిల్లోనికే సేసుకుంటామని పేరు పెట్నారు... యింగిబ్బుడు సేసుకోమంటే యట్లా... నా కెట్లన్నా గానీ లోనిప్పీసా..."

"పేరు రాసుకుంటాను గానీ లోను యిప్పించే శక్తి నాకు లేదయ్యా, కావాలంటే వచ్చే వారం క్రెడిట్ క్యాంపు జరుగుతుంది, పంచాయితీ ఆఫీసు దగ్గరకు రా... చూద్దాం" అని అప్పుడే వచ్చిన బస్సెక్కినాడు ప్రసాద్.

అది మొదలు వెంకటేశులు ప్రసాద్ గతంలో భాగమై వెంటాడ్డం ప్రారంభించాడు... ప్రసాద్ తను పనిచేసే మండల కేంద్రానికి రోజూ ఆ వూరి నుండే బస్‌లో వెళ్తాడు. అప్రయత్నంగానే వెంకటేశులి బతుకు చిత్రాలు చూస్తూనే వున్నాడు. పెట్టె నెత్తిన పెట్టుకుని పూసలూ, సవరాలూ అమ్మడానికి వూర్ల తిరిగే అతని భార్యో... నీలగిరి చెట్ల కింద ఆడుకుంటూ బస్‌లు ఆగుతూనే పరిగెత్తుకొని వచ్చి బస్‌లో వాళ్ళను డబ్బులు అడుక్కునే అతని పిల్లలో కళ్ళలో పడుతూనే వున్నారు. ఊర్లో నుండీ డేరాలోకి

జారిన అతని జీవితం... పేదరికం నుండీ భిక్షాటనలోకి మారుతున్న అతని వారసత్వం... తనకు గుచ్చుకుంటూనే వుంది... ఆ వూర్లో తనకు పరిచయమున్న వాళ్ళు ఎవరు కన్పించినా... వెంకటేశులి వివరాలే తెలుసుకుంటున్నాడు.

❁❁❁

ఇల్లరికపు అల్లుడిగా ఆ వూరొచ్చాడు వెంకటేశులు. కళ్యాణదుర్గం అవతల చెర్లోపల్లి అతని స్వంతూరు. పుట్టుకతో తండ్రిని కోల్పోయాడు. కాస్తా పెద్దగయినాక తల్లి చనిపోయింది. తర్వాత అక్కడా యిక్కడా బంధువుల యిండ్లలో, పంచల్లో వడి పెద్దగయినాడు. బుద్ధి వచ్చినప్పట్నుంచీ కులవృత్తి గాజుల మలారంతో వూర్లు తిరగడం జీవనాధారం చేసుకున్నాడు.

"మనోడే ఎనకా ముందూ లేనోడు... నువ్వు సెయ్యందిస్తే... యెట్లో గట్లా పైకొస్తాడు సూడీ... నీ కూతురికి అత్తపోరూ వుండదు, ఆడబిడ్డపోరూ వుండదు" అని వెంకటేశుల్ని గురించి దూరపు బంధువొకాయన కమ్మవారిపల్లి నారాయణప్పకు చెప్తే, వెంకటేశులకి ఆయన తన బిడ్డ నిచ్చాడు.

నారాయణప్పకు ముగ్గురు కొడుకులు, అల్లుడ్ని నాలుగో కొడుకనుకొని తనవద్దే వుంచుకున్నాడాయన. తండ్రి మీది గౌరవంతో కొడుకులూ అడ్డు చెప్పలేకపోయారు. చెల్లెలు తమ కళ్ళెదుటనే తిరగనీ అనుకున్నారు.

నారాయణప్ప కూతురికీ అల్లుడికీ ఒక యిల్లు కట్టించి యిచ్చాడు. ఇంటి ముందరే పెట్టంగడి పెట్టించి, అంగళ్ళో కూచోని వ్యాపారం చేసుకోమన్నాడు.

ఆత్మీయులెవరూ లేని వెంకటేశులు భార్య అనురాగానికి తీగలా అల్లుకున్నాడు...

పరాయి వూరోడైనా, ఆస్తిపాస్తులు లేకున్నా, అణుకువైన వాడనీ, పెళ్ళాన్ని పువ్వుల్లో పెట్టుకునే మొగుడనీ వూర్లో వాళ్ళు, అతన్ని మెచ్చుకున్నారు.

నాగలక్ష్మమ్మ మొదటి పురుడు పోసుకుంది... ఆడబిడ్డ పుట్టింది... వెంకటేశులి ఆనందానికి హద్దులేకపోయింది...

ఏ దిక్కూ లేని అతనికి... ఓ యిల్లూ వాకిలీ... భార్యా బిడ్డా... ఒక వూర్లో అంతో యింతో గౌరవప్రదమైన కుటుంబపు అండా... తనకంటూ ఒక గుర్తింపూ...

స్థిరమైన జీవితపు మాధుర్యాన్ని రుచి చూపిస్తూ ఐదేళ్ళు గడిచాయి.

నాగలక్ష్మమ్మ రెండో కాన్పు సమయం... కాన్పు కష్టమై బిడ్డ అడ్డం తిరిగి... మంత్రసాని పల్లెటూరి వైద్యానికి... తల్లీబిడ్డా యిద్దరూ పురిట్లోనే చనిపోయారు...

భార్య యెడబాటుతో వెంకటేశులు దిక్కులేని వాడయ్యాడు... అయోమయంలో పడ్డాడు... ఏ పనీ చేయలేకపోయాడు.

ఆమె లేని లోటును పూడ్చే దగ్గరి బంధువులూ, స్నేహితులూ లేక పిచ్చివాడిలా తయారైనాడు...

కళ్ళు మూసుకుంటే భార్య... కళ్ళు తెరిస్తే ఆమె లేని శూన్యం... వూరు గాని వూరు... మామ అనారోగ్యంతో మంచాన పడ్డాడు... బావమరుదులు వాళ్ళ యిబ్బందుల్లో వాళ్ళు... ఎదురుగా చిన్నపాప...


వెంకటేశులు విధికి ఎదురీదలేకపోయాడు... మలారం భుజాన వేసుకొని పాత జీవితంలోకి జారిపోయాడు... కూతుర్ని అత్త చేతుల్లో పెట్టి... నెలల తరబడి వూర్ల మీద తిరుగుతూ... మెల్లగా తాగుడుకు అలవాటు పడ్డాడు... "రెండో పెళ్ళి చేసి వూర్లో వుంచుకోకూడదా... వూర్ల మింద తిరిగి సెడిపోతాడీ తలమాసినోడు... ఇట్లయితే పసిబిడ్డ గతేం గావల్లా..." అని వూర్లో వాల్లడిగితే,

"ఊరూ వాడా తెలీనోడు, ఎనకా ముందూ లేనోడు, మా నాయన గాబట్టి బిడ్డనిచ్చి వుంచుకున్నాడు గానీ... ఏమీ లేనోనికి బిడ్డ నెవురిస్తారు... యిప్పిచ్చే దానికి మాకేం బట్టింది" అన్నారు బావమరుదులు.

"నాయనా వూర్ల మింద తిరగొద్దురా... యింటి కాడుండి నీ బిడ్డన్నువ్వు సూసుకోరా..." అత్తమాటలు వెంకటేశుల్ని వూర్లో నిలపలేకపోయాయి. బిడ్డమీది ఆపేక్షను భార్యా వియోగం మింగేసింది... భార్య మరణంతో చేజారిన ఆనందాన్ని వెతుక్కుంటూ ఎండమావుల వెంట దేశద్రిమ్మరై తిరిగినాడు...

ఎప్పుడో మనసు పుట్టినప్పుడు అత్త పెంపకంలో పెరుగుతున్న కూతుర్ని చూసిపోతుండే వాడు.

## "చాట భాగవతం"



**ఆ** మధ్య బాపు గారికి బెంగుళూరులో సన్మానం జరిగింది. ఆ సందర్భంగా 'పరాగ్' హోటల్‌లో కార్టూనిస్టులందరితో బాపు గారు సరదాగా కబుర్లు చెబుతున్నారు.

"మీ 'భాగవతం' సీరియల్ ఎప్పుడు పూర్తవుతుంది సార్?" అని ఎవరో అడిగారు. (గత కొన్నేళ్లుగా ఓ టీవీ ఛానెల్ కోసం బాపు గారు భాగవతం సీరియల్ తీస్తున్నారు.)

"ఇంకా పూర్తి కాలేదు. చాట భాగవతం కదా!" అన్నారు.

మూడేళ్ళుగా తెగిన గాలిపటంలాగా దేశమ్మీద తిరుగుతున్న వెంకటేశుల్ని

ఓ సాయంత్రం... ఒక వూరి కల్లు పాకలో పూసల ముత్యాలమ్మ చూసింది. కంటికి నదురుగా కన్పించాడు. తను ఒక సీసా తీసుకుంటూ, కల్లు సీసాలవైపు ఆశగా చూస్తున్న వెంకటేశులకి యింకొక సీసా యిప్పించింది. నంజుకోవడానికి కాల్చిన ఎండు చేప ముక్కలు తెచ్చిచ్చింది.

అతను తాగుతానన్నంతా తావిచ్చి... తప్పతాగి పడిపోతే... తన డేరాలోనే పడుకో బెట్టుకుంది.

ఓ పొద్దు కాడ... అరమెలుకువలో... యింకా తగ్గని మత్తులో.. ఏ మంత్ర లోకాల్లోనో తిరుగులాడుతూ వెంకటేశులు పక్కనే వున్న ముత్యాలమ్మలో ఐక్యమైపోయాడు.

తెల్లవారినా తీరని వెంకటేశులి మత్తును... దగ్గరే వున్న బోరింగ్ కింద కూర్చోబెట్టి వయసుకొచ్చిన కూతురితో బోరింగ్ కొట్టిస్తూ... వీపును రుద్ది రుద్ది... ఎండ్ల తరబడి పేరుకుపోయిన మురికిని... మోహపాశాల సోపుతో వదలగొట్టింది ముత్యాలమ్మ.

అప్పట్నుంచీ ముత్యాలమ్మ వెంటబడ్డాడు వెంకటేశులు. "అత్తా... అత్తా" అంటూ వెంట తిరుగుతూ... వాళ్ళుండే డేరాల్లో వుంటూ... ఆఖరికి ఆమె కూతురికి మొగుడైనాడు.

ఆ మత్తులోనే ఓ ఐదేండ్లు గడిచి... రెండో భార్యతో ఇద్దరు పిల్లలకు తండ్రై... అత్త ముత్యాలమ్మ కాస్తా అర్ధాంతరంగా చనిపోగా... కమ్మవారిపల్లెలో వున్న కూతురూ యిల్లూ గుర్తుకొచ్చి భార్యాపిల్లల్తో వూర్లోకి దిగినాడు.

"బంగారమట్లా కూతుర్ని మరిచిపోయి... అడక్క తినేదాన్ని కట్టుకోని మా యింట్లో కాపురం పెడతానంటావురా... కులం దప్పిన్నా కొడకా... మా పాపే పోయినెంక నీకు, మాకూ, సంబందమేందిరా..." అని బావమరుదులు తన్నడానికొచ్చారు. ఇంట్లోకి రానివ్వమన్నారు.

'నా కూతురు వాళ్లింట్లో వుంది... నా కూతుర్నన్నా నాతో పంపమనండని' వూర్లో వాళ్ళని కుప్పేసి అడిగినాడు వెంకటేశులు.

"ఇంగాడ నీ కూతురు... అది మా కోడలు... యిన్నాళ్ళు లేని భ్రమ యిబ్బుడొచ్చిందా..." అని దబాయించి పంపినారు.

మరలా కొన్ని రోజులకి, కొందరు పూసల వాళ్లతో పాటు కమ్మవారిపల్లె కొచ్చి వూరి ముందర డేరా వేసుకున్నాడు వెంకటేశులు.

"బజార్లో నోట్లోకి వుంపించుకున్నట్లయింది వాంతోని... వూర్ల తలెత్తుకోని తిరగలాకుండైంది... దరిద్రపు నా కొడుకు అడక్క తినే ముండని యేస్కోని మనూరికె వొచ్చి పడెనే, కొంపలోకి, రానీకుంటే, యింగ రాడేమోననుకుంటే డేరానే ఏసినే... యెక్కడ దప్పిన్నా కొడుకురా వీడు..." అనుకుంటూ బావమరుదులు వెంకటేశులు డేరా వేయడాన్ని మింగలేక, కక్కలేక అవస్థలు పడ్డారు.

"నాయిన్లారా వాని సొత్తు మనింట్లో పెట్టుకోందాము... దాని కోసరము, వాడొచ్చి

నాడు... మీరు అవమాన పడతాండారు. మేనమామ గార్రైన పుణ్యానికి మీకిది తప్పింది గాదు... దాన్నెత్తిన యిన్ని అచ్చింతలు యేపిచ్చి మీ సొత్తు సేసేసుకోంౘప్పా... వాణ్ణింగ యీసగాలకు రాకుండా సేయొచ్చు, వూర్లోటోల్లు గూడా మిమ్మల్ని సైయ్యంటారు అబ్బుడు..." తల్లి మాటల్లో పరిష్కారం వెతుక్కున్నారు. అయితే వెంకటేశులకి వుచ్చు బిగించాలని, పెళ్ళి ఖర్చులకి లెక్కిమ్మన్నారు!

❁❁❁

పంచాయితీ ఆఫీసు వరండాలో... క్రెడిట్ క్యాంపు. బ్యాంకు వాళ్ళూ... మండలాభివృద్ధి ఆఫీసు వాళ్ళూ కూర్చుంటే వాళ్ళను చుట్టుముట్టి వందలకొద్దీ జనాలు...

నా పేరంటే... నా పేరు రాసుకోండని ఎగబడుతున్నారు.

ఆ జనాల గుంపులో యెర్రమఫ్లర్ తలకు చుట్టుకొని వెంకటేశులు ప్రసాద్‌కు కన్పించాడు.

అందరికంటే చివర్న వున్నాడు... తొక్కిసలాటలో ముందుకు రాలేకపోతున్నాడు.

"నువ్వేంటికి యీటికొచ్చినావురా... వూర్లో వుండే వాకే... గ్యారెంటీలూ షూరిటీలూ పెట్టిచ్చుకోని లోన్లిచ్చేది కనా కష్టంగా వుంటే, వూర్ల మింద తిరిగేటోనివి నీ కాడిస్తార్రా యీ సబ్సిడీ లోన్లు..." తెలిసినతను వెంకటేశులు ముఖం మీదనే అన్నాడు.

వెంకటేశులు ప్రసాద్ వైపే చూస్తున్నాడు... ప్రసాద్‌కు వెంకటేశుల్ని ఎంపిక చేయమని బ్యాంకు మేనేజర్నూ, ఎండీవోనూ అడగాలనుంది. అడిగితే

"ఉండడానికి యిల్లు గూడా లేనోడు... లోన్ ఎట్లా వాపస్ కడతాడు, మీరు షూరిటీ యిస్తారా...'' అని నవ్వుతారేమోనని అడగలేకపోతున్నాడు.

సర్పంచీ, బ్యాంకు మేనేజరూ, ఎండీవోలు వాళ్ళకు కావాల్సిన పేర్లు రాసుకోవడంతో, షరా మామూలుగా క్రెడిట్ క్యాంపు ముగిసింది.

❁❁❁

ఓ వారం రోజుల తర్వాత.

ఉదయం బస్‌లో ఆఫీసుకెళ్తున్న ప్రసాద్‌కు కమ్మవారిపల్లె బస్టాప్ ఎదురుగా ఏదో వెలితిగా అన్పించింది. రోజూ కన్పించే డేరాలన్నీ మాయమై వున్నాయి.

బస్ బయట నిలబడ్డ తెలిసినతన్ని పిలిచి, డేరాలూ, ఆ మనుషులూ ఏమైపోయారని అడిగాడు. పొద్దున్నే అంతా సర్దుకొని ఎల్లిపోయారని, అతను చెప్పాడు.

"మరి వెంకటేశులూ... వెళ్ళిపోయాడా, పెళ్ళి చేశాడా" ఆత్రంగా అడిగాడు.

"వాడా సా... వారం కిందట పంచాయితీ పెట్టిచ్చి... మొన్న శనివారం నాడు బావమరిది కొడుకుతోని గుళ్లో తలంబ్రాలు పోయిచ్చా... అదిగో వాడూ వూరిడుస్తాన్నాడు..." అని బస్‌కు అటువైపు చూపించాడు.

"పెళ్ళి ఖర్చులెట్లా..."

"గుళ్ళో పెళ్ళికేమి కర్చు సా... అంతా ఆ పాప మేనమామ గార్లే యేసుకోండారు... వాని చేత ఏమీ గాదని పెద్ద మనుషుల్లోని పంచాయితీ చెప్పిచ్చుకునె గదా..." వింటూ ఆత్రంగా లేచి ప్రసాద్ అటువైపు చూశాడు.

మర్రిచెట్టు కింద వెంకటేశులు కూతురు కన్పించింది... నలిగిన ఎర్రంచు తెల్ల చీరలో వుంది... ముందుకు వేసుకున్న జడలో వాడిన కనకాంబ్రాలు... అమ్మాయి ఏడ్చినట్లు ముఖం వుబ్బింది.

పక్కనే వెంకటేశులు... ఎటో చూస్తున్నాడు. రోడ్డు మీద కదలడానికి సిద్ధంగా వున్న గుర్రం మీద సామాన్లు సర్దున్నాయి... వాటి మీద వెంకటేశులి కొడుకు కూర్చొని వున్నాడు...

మరో గుర్రమ్మీద ప్లాస్టిక్ కడవల గుట్ట, అటూ యిటూ. వెంకటేశులి పెళ్ళాం నెత్తిన పెట్టె... సంకలో పిల్లతో.

వెంకటేశులు... లుంగీతో కళ్ళు తుడుచుకుంటూ కూతురి చేయి విడిపించుకుంటున్నాడు...

అతను ఏ వూరు పోతున్నాడో... బహుశా అతనిక్కూడా తెలీదేమో...

ప్రసాద్ ఎక్కిన బస్సు ముందుకు కదుల్తోంది... అమ్మాయి శోకదేవతై చెట్టు కింద నిలబడుంది...

వాళ్ళ దారి నుండీ వెంకటేశులు వెనుకకు కదలి పోతున్నాడు...

○